క్లుప్తంగా

నేత్ర వైద్య శిబిరం



నేత్ర శస్త్రచికిత్సల నిమిత్తం విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి పయనమైన వృద్ధులు

దత్తిరాజేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండే షన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరానికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన 75మందికి ఆప్తాలమిక్ జాక్సన్ కంటి పరీక్షలు చేశారు. వీరిలో 37 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. చిన్నచిన్న సమస్యలు ఉన్నవారికి మందులు అందజేశారు. అనంతరం శస్త్రచికిత్సలకు ఎంపిక చేసిన 37 మందిని ఆపరేషన్ నిమిత్తం విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. తొమ్మిదోరోజు ఆదివారం అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.అర్చకులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. జిల్లా నలు మూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

కుళాయిల ట్యాప్‌లు చోరీ



దొంగలు ట్యాప్ దొంగిలించడంతో ఖాళీగా ఉన్న కుళాయి

శృంగవరపుకోట: పట్టణంలో దొంగలు పేట్రేగి పోతున్నారు. ఇటీవల పోలీస్ పెట్రో లింగ్ పూర్తిగా కనుమరుగవడంతో, సరైన నిఘా లేకపోవడంతో పట్టణంలో దొంగతనాల జోరు పెరిగింది. నిన్నటి వరకూ ఇళ్లలో, దుకాణాల్లో చోరీలకు తెగబడ్డ దొంగలు ఇప్పుడు పబ్లిక్‌గా ప్రభుత్వ, ప్రజా ఆస్తులను దోచేసేందుకు సిద్ధమయ్యారు. జలజీవన్ మి షన్ పథకంలో భాగంగా ఇటీవల ఇంటింటి కుళాయిల పనులు చేపట్టారు. పట్టణంలో ఒక పక్క పనులు అవుతుండగానే శ్రీనివాసకాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన కుళాయిలకు బిగించిన హెడ్‌లను శనివారం రాత్రి దొంగలు పీకేశారు. రెండు వీధుల్లోని వీధి కుళాయిలను ప్రారంభించక ముందే ట్యాప్ లను దొంగిలించారు. దీంతో సుమారు రూ. 20వేల మేర నష్టం వాటిల్లింది.

పంచాయతీ ఈఓకు సన్మానం



ఈఓ జనార్దనరావును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది

గజపతినగరం: పురిటిపెంట పంచాయతీ ఈఓ జి.జనార్దనరావు ఉద్యోగోన్నతిపై బొబ్బిలి మండలానికి బదిలీ అయ్యారు. ఆయనకు వీడ్కోలు పలుకుతూ సర్పంచ్,కౌంత్యాన విజయలక్ష్మి, వైస్ సర్పంచ్ మండల సురేష్, గ్రామ సచివాలయ సిబ్బంది ఆదివారం సన్మానించారు. జనార్దనరావు స్థానంలో ఇన్‌చార్జి ఈఓ ఎం.రమణ బాధ్యతలు తీసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయ సీనియ ర్ పరిపాలన అధికారి పప్పు సుదర్శనం, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ బొంతలకోటి శంకరరావు, స్థానిక పెద్దలు కరణం ఆదినారాయణ, అట్టాడ లక్ష్మునాయుడు,మంత్రి నర్సింగరావు, సత్యం అప్పలనాయుడు, ప్రదీప్ కుమార్, సన్యాసిరావు,రాజు, శంకర్, బంగారునాయుడు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

విజయనగరం అర్బన్: జిల్లాలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై లోకేశ్ పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఏపీ రైతుసంఘ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఫ్యాక్టరీని ఆధునీకరణ చేయడం సాధ్యం కాదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పడం సరికాదని అభిప్రాయపడింది. ఈ మేరకు సంఘ జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. లోకేశ్ పాదయాత్ర చేసే సమయంలో సుగర్‌ఫ్యాక్టరీలను ఆదుకుంటామని హామీ ఇచ్చారని, ఈ విషయం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మరిచిపోయి ప్రకటనలు చేయడంపై మండిపడ్డారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని కోరారు.

జగన్‌పై అక్రమ కేసులు అన్యాయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నాయకులు

• మాజీ ఎమ్మెల్యే కడుబండి ధ్వజం

శృంగవరపుకోట: ఉండి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు ఇచ్చిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆది వారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి కేసులు పరిగణనలోకి తీసుకోరాదని మూడేళ్ల క్రితమే సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని ... ఇప్పుడు అందుకు విరుద్ధంగా కేసులు బనాయించడం ఏతర హా రాజకీయమో ప్రభుత్వ పెద్దలు ఆలోచించుకోవాలన్నారు. నాడు సుప్రీం కొట్టేసిన కేసులో నేడు జగన్ పైనా, ఐపీఎస్ అధికా రులు, డాక్టర్లపై కేసులు నమోదు చేయడం ఎవరి సంతోషం కోసమని ప్రశ్నించారు. మూడేళ్ల తర్వాత కేసులు పెడుతూ రాష్ట్ర పోలీసులు కొత్త సంప్రదాయానికి తెర తీశారన్నారు. ఈకేసులో జగన్ ఎలా ముద్దాయి అవుతారని ప్రశ్నించారు. గత నెల 11న ఈ-మెయిల్ ద్వారా గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేస్తే అంతకు ఒక రోజు ముందే జూన్ 10న పోలీసు లు లీగల్ ఓపీనియన్‌కు వెళ్లడం విశేషమన్నారు. అంటే రఘురామ కృష్ణంరాజు ఫిర్యాదు చేస్తారని ముందే పోలీసులకు తెలుసా అని ప్రశ్నించారు. బడికి వెళ్లే ప్రతీ బిడ్డకు తల్లికి వందనం అంటూ రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లులను దగా చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ప్రతీ బిడ్డకి కాకుండా తల్లికి రూ.15వేలు ఇస్తామని మాట మారుస్తూ ప్రభుత్వం జీఓ తీసుకువచ్చి దగా చేయడం తగదన్నారు.ప్రతి పథకాన్ని నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధార్‌తో లింక్ చేస్తే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆధార్‌లింక్ కోసమే జీఓ ఇచ్చామనడం విడ్డూరంగా ఉందన్నారు. నాటి అమ్మ ఒడి పథకానికే తల్లికి వందనం అని పేరు మార్చి దగా చేయాలనుకోవడం తల్లికి పంగనామం పెట్ట డమేనని అన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ సమాధానం చెప్పాలన్నారు. గత నాలుగేళ్ల క్రమం తప్పకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అమ్మఒడి అందించామని అందుకు గణాంకాలే సాక్ష్యం అన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు సూపర్ సిక్స్ హామీలంటూ గొప్పగా ఊరూరా చాటారని, ఇప్పుడు వాటి ఊసెత్తడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి, ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

చక్కెర కర్మాగారం తెరిపించేందుకు చొరవ చూపాలి

జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పెద్దమనసు చేసుకుని భీమసింగి చక్కెర కర్మాగారం తెరిపించే దిశగా చర్యలు తీసుకుని రైతాంగానికి సహాయపడాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు కోరారు. భీమసింగి కర్మాగారం ఆర్థిక ఇబ్బందుల వల్ల మూతపడడం తెలిసిందేనని, నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చొరవ తీసుకుని కర్మాగారాన్ని తెరిపిం చారని గుర్తు చేశారు. అయితే గత కొన్నేళ్లుగా కర్మాగారం మూతపడిందని, మంత్రి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజపతినగరం నియోజకవర్గంలో ఈ కర్మాగారం ఉన్నప్పటికీ, ఎక్కువ మంది చెరుకు రైతులు ఎస్.కోట నియోజకవర్గం వారున్నారని చెప్పారు. మంత్రి శ్రీనివాస్ ప్రభుత్వంతో చర్చించి, కర్మాగారాన్ని తెరిపించే ప్రయత్నం చేయాలని కోరారు. జెడ్పీటీసీ మమ్ములూరి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ వెంకటరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలో పూడికతీత



బొండపల్లి వద్ద పూడిక, తుప్పలు తొలగించిన అనంతరం బి.వి.ఛానల్

బొండపల్లి: బొండపల్లి-వెంకటాపురం (బీవీ ఛానల్) సాగునీటి కాలువలో పూడికతీతతో పాటు, తుప్పలు, డొంకల తొలగింపు పనులు నాలుగు రోజు లుగా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో రైతులు ముమ్మరంగా చేపడుతున్నారు. గజపతినగరం మండలంలోని పట్రువాడ గ్రా మం వద్ద చంపావతి నదిలో అడ్డుకట్టవేసి ఈకాలువ ద్వారా నీటి మళ్లించి చెరువులను నింపి పొలాలకు సాగునీటిని అందిస్తుంటారు. గజపతినగరం మండలంలోని వెంకటాపురం, బూడిపేట, దావాలపేట గ్రామాలతో పాటు,బొండపల్లి మండలంలోని బోడసింగిపేట, బొండపల్లి, తమటాడ, గొల్లలపేట, ముద్దురూ తదితర గ్రామాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. ఏటా ఖరీఫ్ వరినాట్లు వేసే ముందు ఈ కాలువలో పూడికతీత పనులు చేపడుతుంటారు. ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో చంపావతి నదిలో నీటి ప్రవాహం లేదు. మెంటాడ మండలంలోని గుర్ల గెడ్డతో పాటు,ఆంధ్ర రిజర్వాయర్ లీకుల ద్వారా వచ్చే నీరే చంపావతిలో ప్రవహిస్తోంది. వరదనీరు నదిలోకి వస్తేనే చంపావతి నదికి అడ్డుకట్ట వేసి నీటిని మళ్లించే అవకాశం ఉంది. రెండు మండ లాల పరిధిలో ఈ కాలువ కింద సుమారు వెయ్యి ఎకరాల సాగు భూమి ఉంది.

20న మండల సర్వసభ్య సమావేశం

మెరకముడిదాం: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పావని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, మండల ప్రజలు తమ సమ స్యలపై వినతులు అందజేయవచ్చని సూచించారు.

వృద్ధుడు అదృశ్యం



వృద్ధుడు కేశవరావు

శృంగవరపుకోట: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన గంటా కేశవరావు కొంత కాలంగా మతిస్థిమితం లేక అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఈయన ఈనెల 1వ తేదీని మధ్యాహ్నం ఇంటిలో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి, తిరిగి ఇంటికి చేరలే దని కుమారుడు గంటా శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ టి.వి.రమణ తెలిపారు.

భారీ వర్షం

గుర్ల: మండలంలోని కెల్ల, వల్లాపురం, దమరసింగి, మణ్యపురిపేట, గుర్ల గ్రామాల్లో ఆదివారం సుమారు రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. ఎండిపోతున్న వరి నారుకు ఈ వర్షం ప్రాణం పోసిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విజయనగరం ఫోర్ట్: తాటిపూడి జలాశయం వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆదివారం రాత్రి మృతదేహం ఒడ్డుకు కొట్టుకు రావడంతో స్థానికులు వీఆర్‌ఓకు సమాచారం ఇచ్చారు. దీంతో వీఆర్‌ఓ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయసు సుమారు 55 ఏళ్ల వయసు ఉంటుందని అంచనా. గట్టుపై చెప్పులు, టవల్, వాటర్ ప్యాకెట్లు, దువ్వెన ఉన్నాయని ఎస్సై సురేంద్రనాయుడు తెలిపారు. అచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పొలాలకు దారి లేదని రైతుల ధర్నా



గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ధర్నా చేస్తున్న రైతులు

జామి: తమ భూములు తీసుకుని గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించి...తమ పొలాలకే దారి లేకుండా చేశారని జన్నివలస గ్రామానికి చెందిన రైతు లు ఆదివారం గ్రీన్‌ఫీల్డ్‌హైవేపై ధర్నా చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ పంటపొలాల మధ్యలో నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించారని, గ్రామం నుంచి పొలాలకు వెళ్లేందుకు రోడ్డు దాటడానికి మార్గం లేకుండా రెయిలింగ్ అమర్చడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్డు పనులు చేసినప్పుడు పొలాలకు వెళ్లేందుకు ప్రత్యేకంగా మార్గం ఏర్పాటు చేస్తామని హైవే అధి కారులు మాటిచ్చారని, తర్వాత వారు ఇష్టం వచ్చినట్లు రోడ్డు నిర్మించి తమ పొలాలకు దారిలేకుండా చేశారని మండిపడ్డారు. సమస్య పై గతంలో అనేక సార్లు తహసీల్దార్, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితంలేకుండా పోయిందన్నారు. ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. సర్పంచ్ శీరెడ్డి చందునాయుడు, పెద్దలు ఎస్.రామారావు, వర్రి శ్రీను, డి.పైడితల్లి,తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

గుర్ల: మండల కేంద్రం గుర్లతో పాటు కొంగడం డ్రేడు గ్రామంలో సర్పంచ్‌లు ఈ.రమణమ్మ, సారిక గోవింద్ ఆదివారం పారిశుద్ధ్య పనులు చేయించారు. వీధి కాలు వల్లో పూడిక, చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తీయించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందుస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్‌లు తెలిపారు. పారిశుద్ధ్య పనులను ఆయా పంచాయతీల కార్యదర్శులు పర్యవేక్షించారు.

బైరిపురంలో..

మెరకముడిదాం: మండలంలోని బైరిపురంలో సర్పంచ్ ప్రతినిధి పప్పల గ్రహణేశ్వరరావు, ఉపసర్పంచ్ పప్పల కృష్ణమూర్తి ఆదివారం పారిశుద్ధ్య పనులు చేయించా రు. అన్ని వీధి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను, పూడికను పారిశుద్ధ్య కార్మికులతో తీయించారు.



మెరకముడిదాం: బైరిపురంలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న స్థానిక నాయకులు గ్రహణేశ్వరరావు, కృష్ణమూర్తి

రైతుల తరఫున పోరాడతాం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ

శృంగవరపుకోట: అభివృద్ధి పనుల పేరిట ప్రభుత్వం చేస్తున్న భూసేకరణ వల్ల రైతులు నష్టపోతున్నారని, రైతులకు సీపీఐ అండగా ఉంటుందని, వారి తరఫున పోరాడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి వమ్మి రమణ తదితరులు చెప్పారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సీపీఐ సమితి సమావేశం కండిపల్లి భీముడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి వమ్మి రమణ మాట్లాడుతూ పెందుర్తి నుంచి బొడ్డవర వరకూ రోడ్డు విస్తరణ, పోలవరం కాలువ కోసం భూసేకరణలో రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాటమే పంథాగా సాగాలని, సీపీఐ నడుస్తున్నది రాజ్యాధికారం కోసం కాదని, ప్రజాశ్రేయస్సు కోసమే అని చెప్పారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు రామకృష్ణ, శ్రీను, సీహెచ్.నారాయణమూర్తి, సీహెచ్.రాజు, జగ్గయ్య, జామి మండల కార్యదర్శి కృష్ణ, సరోజిని, దమ్ము యామాలు, రామసత్యం, ఎర్రంనాయుడు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

శేషపాన్పుపై జగన్నాథుడు



పూజలందుకుంటున్న జగన్నాథస్వామి

విజయనగరం టౌన్ : రథయాత్ర మహోత్సవంలో భాగంగా కోళ్లబజారులో కొలువైన జగన్నాథస్వామి శేషపాన్పుపై ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు నగేషాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కాళ్లనాయుడు రామమందిరంలో ఆలయ అర్చకుడు ఆరవెల్లి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల వారాల పండగ



జామి: బల్లంకిలో మరిడమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు



దత్తిరాజేరు: ఊరేగింపుగా దేశమ్మతల్లి గుడికి వెళుతున్న పెదమానాపురం గ్రామస్తులు



వేపాడ: బల్లంకిలో పశలమ్మతల్లి శతకం పట్టు వద్దకు గ్రామస్తులు తీసుకువచ్చిన పశువులు



వేపాడ: బల్లంకిలో పశలమ్మతల్లికి పసుపు, కుంకమ,చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో మూడురోజుల పాటు నిర్వహించనున్న గ్రామ దేవతల వారా ల పండగ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. 20 ఏళ్ల తర్వాత పండగ నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. తొలిరోజు గ్రామస్తులు మేళతాళాలు,డప్పు వాయిద్యాలతో దేశమ్మతల్లి గుడికి వెళ్లి పసుపు, కుంకుమ, చీరలు, కోళ్లు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. మంగళవారం దేశాల మ్మ, కొత్తమ్మ, బంగారమ్మ, ముత్యాలమ్మ, పాదాలమ్మ అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

భీమసింగిలో మరిడమ్మ తల్లి పండగ

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో మరిడమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్లి పసుపు,కుంకమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండేలా, పిల్లాపాపలను చల్లగా చూడుతల్లి అంటూ వేడుకున్నారు. పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బల్లంకిలో పశలమ్మ పండుగ

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో పశలమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పశువులు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా గా పండాలని ఏటా ఖరీఫ్ వరినారు పోసిన తర్వాత ఈపండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు. ఏటా మాదిరిగానే గ్రామస్తు లు ఊరేగింపు పశలమ్మ శతకం పట్టు వద్దకు తమ పశువులను తీసుకుని వెళ్లారు. ముందుగా అమ్మవారికి పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పశువులపై ఉదకం జల్లి పూజలు చేశారు. సర్పంచ్ బల్లంకి వరలక్ష్మి, కనక రాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బైరీపురం ఉన్నత పాఠశాల 1986-87 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు

మెరకముడిదాం: బైరీపురం గ్రామంలోని బాదం పెంటయ్య జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–87వ సంవత్సరంలో 10వతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆ పాఠశాల వేదికగా ఆదివారం జరిగింది. ఉన్నత చదువుల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లి ఆ తర్వాత వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులంతా 37 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబ నేపథ్యాల గురించి మాట్లాడుకున్నారు. తాము చదువుకున్నప్పటి తరగతిగదులను చూసుకుని, నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. అలాగే తమతో చదువుకున్న మిత్రుల్లో ముగ్గురు మృతిచెందడంతో వారిని జ్ఞప్తికి తెచ్చుకుని విచారం వ్యక్తం చేశారు. అనంతరం అప్పట్లో వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు జి.వి.సర్వేశ్వరరావు, టి.అప్పలస్వామి, కె.రాజారావును ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు లావుడి వాసు, పప్పల తవిటి నాయుడు, లెంక వెంకటరమణ, కందుల చిన రాజు, వెత్సా ప్రసాద్, బాదం పెంటయ్య, ఎస్.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట ఏపీజీఈఏ కార్యవర్గం ఎన్నిక



ఎస్.కోట ఏపీజీఈఏ నూతన కార్యవర్గ సభ్యులు

జామి: ఏపీజీఈఏ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం)ఎస్.కోట తాలుకా నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు బలరాంపురంలోని భార్గవ్ హెల్ప్‌లైన్ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎస్.సత్యనారాయణరెడ్డి, సహాధ్యక్షుడిగా కె.ముత్యాలమ్మ, కార్యదర్శిగా పడాల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా దేవేంద్రకుమార్, కోశాధికారిగా కోరాడ రమణ, ఉపాధ్యక్షుడిగా ఎస్.అనిల్‌ప్రేమ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా జి.శ్రీనివాసరావు, కె.భూలక్ష్మి, కె.ఈశ్వరమ్మ, జి.శ్రీనివాసరావు, ఎం.శివశంకర్, ఇతర కార్యవర్గ సభ్యులుగా ఎస్.గౌతమి, కె.కామేశ్వరి, కె.యు.కె.చంద్రకమారి,ఎం.రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో సంఘం జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికల అధికారిగా సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి ముదిలి ఆదినారాయణ, ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా జిల్లా సంయుక్త కార్యదర్శి పెనుమత్స మేరి వ్యవహరించారు.

పసికందుపై లైంగికదాడి అమానుషం

విజయనగరం పూల్‌బాగ్: రామభద్రపురం మండలం జీలుగువలసలో పసికందుపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని డిస్ట్రిక్ట్ చైల్డ్‌రైట్స్ ఫోరమ్ కన్వీనర్ పి.చిట్టిబాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో విజయనగరం జిల్లాలో బాలలపై లైంగిక దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని అందోళన వ్యక్తం చేశారు.

పరామర్శ : పసికందుపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడ్ని శిక్షించాలని ఐద్వా జిల్లా నాయకురాలు పి. రమణ మ్మ డిమాండ్ చేశారు. విజయనగరం ఘోషా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని, ఆమె తల్లిని కలిసి పరామర్శించారు. హోమ్ మినిస్టర్ అనిత స్పందించి మానవమృగంపై చర్యలు తీసుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో వంజరాపు లక్ష్మి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు వేగోటి లక్ష్మి, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి డి.కరుణ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.